కలుషిత జలం.. కలవరం

- నెల రోజులుగా అడ్డగుట్ట సీ–సెక్షన్‌లో కలుషిత నీటి సరఫరా
- రోగాల బారిన చిన్నారులు, వృద్ధులు
- అధికారులకు సైతం అంతుచిక్కని సమస్య


ఖాళీ బిందెలు పట్టుకొని వాటర్ ట్యాంకర్ల కోసం ఎదురుచూస్తున్న మహిళలు

అడ్డగుట్ట: కలుషిత నీటి సరఫరా కారణంగా తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదు. సమస్యను పరిష్కరించి కలుషిత నీటి సరఫరాని అరికట్టాలని అధికారులు, నాయకులను సంప్రదించినా ఎవ్వరూ కూడా పట్టించుకున్న పాపాన పోలేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ సమస్యను ఇంకెవరికీ చెప్పుకోవాలో అర్థం కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అడ్డగుట్ట సీ–సెక్షన్ వాసులు. డివిజన్‌లోని సీ–సెక్షన్, ముత్యాలమ్మ దేవాలయం, కమ్యూనిటీహాల్ సమీప ప్రాంతాల్లో నెల నుంచి తాగునీటిలో మురుగునీరు వస్తుండటంతో నీటికోసం నరకయాతన అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

పైప్‌లైన్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పైప్‌లైన్ సైజు పెద్దది చేసేంత వరకు తమ సమస్యకు పరిష్కారం దొరకదని బస్తీవాసులు వాపోతున్నారు. నూతన పైప్‌లైన్ వేయకుండా అలాగే వదిలేస్తే సమస్య ఇంకా తీవ్ర స్థాయికి చేరుతుందని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నేతలకు కలుషిత నీటి సరఫరా అవుతుందని మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదు. పలు బస్తీల్లో మంచినీటి నల్లాలో నెల నుంచి మురికి నీరు సరఫరా అవుతున్నా జలమండలి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం సమస్య ఎక్కడుందన్న విషయం కూడా తెలుసుకోలేక పోతున్నారు. కలుషిత నీటి సరఫరాతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించకుంటే జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని బస్తీవాసులు హెచ్చరిస్తున్నారు.

నెల రోజులుగా శ్రమిస్తున్నా..

అడ్డగుట్టలోని సీ సెక్షన్, ముత్యాలమ్మ దేవాలయం, కమ్యూనిటీహాలు ప్రాంతంలో దాదాపు నెల రోజులుగా నీళ్లు రావడం లేదు. ఒక వేళ నీటి సరఫరా చేసినా కూడా పూర్తిగా కలుషిత నీళ్లు మాత్రమే వస్తున్నాయి. దీంతో సమస్యను తెలుసుకునేందుకు మారేడుపల్లి జలమండలి అధికారులు నెల నుంచి శ్రమిస్తున్నారు. బస్తీలలో ఎక్కడపడితే అక్కడ తవ్వి పైప్‌లైన్‌లను పరిశీలిస్తున్నారు. అయినా కూడా ఇప్పటివరకు సమస్య అంతు చిక్కకపోవడం గమనార్హం. సమస్యను గుర్తించేందుకు ఇంకా రెండు మూడు రోజులు పడుతుందని జలమండలి అధికారులు చెబుతున్నట్లు సమాచారం.

నీళ్లు తాగలేకపోతున్నాం..



పూర్తిగా దుర్గంధంతో సరఫరా అవుతున్న కలుషిత నీరును తాగలేకపోతున్నాం. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే మంచినీళ్లు కూడా ఈ విధంగా కలుషితమైతే ఏం తాగి బతకాలి. చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారు. కేవలం ఎన్నికల సమయాల్లోనే పర్యటనలు చేసే నాయకులు ఇప్పుడు బస్తీ దరిదాపుల్లో కూడా కనిపించడం లేదు. మా సమస్యను ఇంకెవరికి చెప్పుకోవాలి. –లక్ష్మి, స్థానికురాలు

అధికారులు స్పందించాలి..



గత నెల రోజులుగా కలుషిత నీటి సరఫరా కారణంగా చుక్క నీరు కూడా అందడం లేదు. దీంతో వారానికి ఒక్కసారి లేదా రెండు సార్లు వచ్చే వాటర్ ట్యాంకర్ల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే అనేక సార్లు మారేడుపల్లిలోని జలమండలి కార్యాలయాల్లో ఫిర్యాదు చేశాం. తొందరలోనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడమే కాని పరిష్కరించడం లేదు.ఉన్నతాధికారులు మా సమస్యపై స్పందించాలి. – లక్ష్మి, సీ–సెక్షన్ వాసి

సమస్యల పరిష్కారానికి కృషి


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్

రసూల్‌పురా: కార్ఖాన బస్తీలో కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌తో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో స్థానిక వినాయక టెంపుల్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌తో కలిసి శ్రీగణేష్ ఆదివారం పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే అన్నదానం నిర్వహిస్తామని బస్తీ వాసులు విఘ్నేశ్వరుడిని కోరారని ఆ భగవంతుడి ఆశీస్సులతో తాను విజయం సాధించడంతో ఆలయంలో పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీగణేష్ చెప్పారు. బస్తీవాసులు పవర్‌బోర్‌వెల్ పైపు లైను ఏర్పాటు, మురుగునీటి సమస్య పరిష్కరించాలని తమ దృష్టికి తీసుకువచ్చారని సీఈవోతో కలిసి బస్తీలో పర్యటిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గొల్లకురుమలపై చిన్నచూపు తగదు


మాట్లాడుతున్న నవీన్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: గొల్ల కురుముల పట్ల సీఎం రేవంత్ రెడ్డి చిన్న చూపు తగదని కురుమ రాజ్యాధికార పోరాట సమితి (కేఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 40 లక్షల జనాభా గల గొల్ల కురుమ కులానికి చెందిన ఒక్కరికి మంత్రి వర్గంలో చోటు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న మంత్రి వర్గ విస్తరణలోనైన ఆలేరు ఎమ్మెల్యే ఓయూ పూర్వ విద్యార్థి బీర్ల ఐలయ్యకు హోంమంత్రి పదవి ఇవ్వాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గొల్ల కురుములకు రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం లభించిందని కాంగ్రెస్ పార్టీ కూడా అవకాశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ విద్యార్థి సంఘం నాయకులు డా.కంకల ఎలెందర్ కురుమ, గొరిగే మల్లేష్ కురుమ, జేఏసీ నేతలు పర్వతాలు కురుమ, గురునాథ్ కురుమ, కేఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు సతీష్, మన్మోహన్, భాను చందర్, కేమిడి ఉపేందర్, కల్లే మల్లేష్ కురుమ పాల్గొన్నారు.

సేవా రంగంలో రాజేష్‌కు డాక్టరేట్



లాలాపేట: సామాజిక సేవా రంగంలో మన్యంకొట్టి రాజేష్ చేస్తున్న కృషిని గుర్తించిన తమిళనాడులోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఈయన గత కొంత కాలంగా ఎంతో మంది అనాథలను చేరదీసి దుస్తులు ఇవ్వడం, అన్నంపెట్టడం, నిరాశ్రయులకు వసతి కల్పించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ఈ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. రానున్న రోజుల్లో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.

ప్రారంభానికి ముస్తాబవుతున్న మెగా హాస్టల్ భవనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఐపీఈ సమీపంలోని దర్గా వద్ద పీజీ విద్యార్థుల కోసం నిర్మిస్తున్న బాలుర హాస్టల్ ప్రారంభానికి ముస్తాబవుతుంది. మూడు ఎకరాల స్థలంలో సుమారు రూ.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనంలో 700 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న హాస్టళ్లలో కెల్ల అతిపెద్ద హాస్టల్ భవనం ఇదే. ఈ భవన నిర్మాణంతో విద్యార్థులకు హాస్టల్ గదుల సమస్యలు కొంత మేరకు పరిష్కారమవుతుంది. ఇదిలా ఉండగా ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం మరో హాస్టల్ భవనం నిర్మాణంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్వర్‌కు సన్మానం


రాజేశ్వర్ దంపతులను సన్మానించిన జెక్‌కాలనీ సభ్యులు

సనత్‌నగర్: పదవీ విరమణ పొందిన ఉద్యోగిని తోటి ఉద్యోగులు సన్మానించి వీడ్కోలు పలకడం సర్వ సాధారణం. కానీ తాను అందించిన సేవలను గుర్తుపెట్టుకుని ప్రజలే కదిలివచ్చి ప్రభుత్వ ఉద్యోగిని సన్మానించడం అనేది అరుదైన విషయం. అలాంటి అరుదైన సన్మానాన్ని బాలానగర్ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసి పదవీ విరమణ పొందిన రాజేశ్వర్ అందుకున్నారు. తమ కాలనీ కోసం రాజేశ్వర్ చేసిన సేవలకు జెక్‌కాలనీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రజల మన్ననలు పొందడం కన్నా సార్థకత ఏముంటుందని ఈ సందర్భంగా పలువురు తెలిపారు. జెక్‌కాలనీ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్, ప్రతినిధులు సుదర్శన్‌రావు, సీహెచ్.అనంతరెడ్డి, శివారెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, భాస్కర్‌రావు, కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, విశ్వనాథరాజు, సునీల్, రాజా, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, నర్సింగరావు, సోమ వెంకట్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిల విడుదలపై సీఎం స్పందించాలి

కాచిగూడ: బీసీ విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ఉన్నత విద్యను అభ్యసించే లక్షలాది మంది బీసీ విద్యార్థులకు రూ.5 వేల కోట్లకు పైగా ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేసి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. లేదంటే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేడు 'గాంధీ'లో వైద్యుల రక్తదాన శిబిరం


గాంధీఆస్పత్రి : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ ఆస్పత్రిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. ప్రధాన భవనం మొదటి అంతస్తులోని బ్లడ్‌బ్యాంకులో ఉ. 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు.

పచ్చదనం పరిరక్షణకు పాటు పడాలి


మొక్క నాటుతున్న శ్రీనివాసచారి

లాలాపేట: పచ్చదనం పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటు పడాలని ప్రధాని నరేంద్ర మోదీ అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివారం తార్నాక డివిజన్ పలువురు బీజేపీ నాయకులు తమ అమ్మ పేరున ఓ మొక్కను నాటారు. శ్రీనివాసచారి తన తల్లి తనుకోజు ఊర్మిళ పేరుతో మామిడి మొక్కను నాటారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మొక్క పెద్ద చెట్టు అయ్యే వరకు కాపాడి సంరక్షిస్తానన్నారు. పచ్చదనం కోసం ఇదే స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచయ్యయాదవ్, భిక్షపతి, ఉపేందర్ యాదవ్, రామకృష్ణచారి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న మోహన్‌రావు

లాలాపేట: తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో జరిగింది. డా. టీవీ రావు అధ్యక్షతన అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. ప్రధాన అధ్యక్షుడిగా డా. పి. మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా పి. ఉదయభాను ప్రసాద్ కార్యదర్శిగా పి. మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎం.ఎం ఉస్సేన్, కోశాధికారి హరికుమారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డా. టి. లక్ష్మీనారాయణ, శోభాకరరావు, స్వరూపారాణి, నిరంజన్‌బాబు, విజయభాస్కర్ రావు, రవి ముత్తుకృష్ణ, సలహాదారులుగా చిన్నయ్య, మైథిలీ, పరమ హంస ఎన్నికయ్యారు.

నోట్ బుక్స్ పంపిణీ


నోట్ బుక్స్ పంపిణీ చేసిన కార్పొరేటర్లు

బౌద్ధనగర్: అశోక్‌నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బౌద్ధనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమవంతు సాయంగా ముదిరాజ్ సంఘం సభ్యులు నోట్ బుక్స్ అందజేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కనకయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. సనత్‌నగర్‌లోని ఉదయ్‌నగర్ కాలనీలోని పార్కులో రూ.9 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ క్రీడా పరికరాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో బస్తీలు, కాలనీలు తేడా లేకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తొమ్మిదేళ్లలో ఎవరూ ఊహించని విధంగా అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు దాటినా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రూపాయల విలువైన అనేక అభివృద్ధి పనులను నూతన ప్రభుత్వం రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ఈఎస్ఐ శ్మశానవాటిక ఆధునికీకరణ కోసం రూ.3 కోట్లు, బేగంపేటలో ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణం తదితర అభివృద్ధి పనులను మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుందని ఆరోపించారు. ఈ ఆషాఢ మాసం అనంతరం అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ మోహన్, వాటర్‌వర్క్స్ అధికారి వంశీ, కాలనీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, కరీం, పుష్పలత, సరిత పాల్గొన్నారు.

గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసిన కంటోన్మెంట్ నేతలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ను ఆదివారం కంటోన్మెంట్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన వివిధ సర్వీస్ ఛార్జీలు విడుదల అయ్యేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా బొల్లారంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జనరల్ హాస్పిటల్‌ను అత్యాధునిక ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో డాక్టర్ నరసింహ కన్నన్, పీసీసీ సెక్రటరీ అయూబ్ ఖాన్. మైనారిటీ నాయకులు జమీల్, పార్టీ సీనియర్ నాయకులు రాజేష్ యాదవ్, గజ్వేల్ భరత్ ఉన్నారు.

వర్సిటీలలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నామా సైదులు ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓయూతో పాటు కేయూ, జేఎన్‌టీయూ, తెలుగు వర్సిటీలతో 25 సంవత్సరాలుగా బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతావాహన, బాసర ట్రిపుల్‌ఐటీ, తెలంగాణ మహిళ వర్సిటీలను స్థాపించిన నాటి నుంచి ఇంత వరకు ఒక్క బ్యాక్‌లాగ్ ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అనేక అభివృద్ధి పనులను చేపట్టకుండా ప్రజా సమస్యలు పరిష్కారం పట్ల ప్రభుత్వం, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆషాఢ మాసం అనంతరం పాదయాత్రకు రూపకల్పన చేస్తామని చెప్పారు. సమస్యలపై ప్రజా క్షేత్రంలో పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ నెల 9న జరిగే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, 21, 22 తేదీల్లో జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులు, ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కొలను బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, లలితా చౌహాన్, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, శ్రీహరి, గులాబ్‌సింగ్, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్, ఆంజనేయులు, శేఖర్, కరీంలాల్, ఖలీల్, అఖిల్ పాల్గొన్నారు.